క్లుప్తంగా

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన


విజేతలతో ఎస్సై స్వామి

పాలకుర్తి: మండలంలోని కన్నాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై స్వామి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని, షీటీం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ ఏరియా సంతోష్‌నగర్ వాసులకు బుధవారం కాలనీ కాంగ్రెస్ నాయకులు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారులు వచ్చేనెల నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవాలని సూచించారు. కాలనీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మాజీ కార్పొరేటర్ సాగంటి శంకర్, జక్కుల దామోదర్‌రావు, కిషన్‌నాయక్, రాములు, మహేశ్, రాజేశం రాజు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

నిరుపేదలకు టార్పాలిన్లు పంపిణీ

ధర్మారం: మండలంలోని కొత్తూరులో పూరి గుడిసెలో ఉంటున్న పది మంది నిరుపేదలకు కొలుముల దామోదర్‌యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టార్పాలిన్లు ఫౌండేషన్ సభ్యులు బుధవారం అందించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పూరి గుడిసెలు ఉరుస్తున్నాయని ఫౌండేషన్ సభ్యుల ద్వారా తెల్సుకున్న దామోదర్‌యాదవ్ రూ.25వేల విలువైన పది టార్పాలిన్లు ఫౌండేషన్ ఇన్‌చార్జి పులకొల్ల లింగమూర్తి పంపిణీ చేశారు. మాజీ సర్పంచు తాళ్ల మల్లేశం, నాయకులు బానోతు లాల్‌సింగ్, కోడూరి కనుకయ్య, తోడేటి సురేశ్, గుగులోతు సంజీవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మండలంలో అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రహదారులు, భవనాలతో పాటు అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సమావేశంలో మేకల సంపత్‌యాదవ్, చింతం తిరుపతి, బొమ్మగాని అనిల్, సాయికుమార్, గుర్రం లక్ష్మిమల్లు, పొన్నం రాజేశ్వరి, తోట రాజ్‌కుమార్, పెండ్లి నారాయణ, గుర్రం శంకర్, బోయిని బాలకృష్ణ, దండె కిషన్ పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకం వినియోగించుకోండి

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సూర్యఘర్ పథకం కింద రాయితీపై ఇంటి పైకప్పుపై సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీ (ఏసీబీ) రీజినల్ మేనేజర్ రవీంద్ర కుమార్‌సింగ్ సూచించారు. పెద్దపల్లిలో బుధవారం పీఎం సూర్యఘర్ పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవడమే కాకుండా అదనంగా ఉత్పత్తి చేస్తే ఆదాయం కూడా పొందవచ్చని వివరించారు. ఇంటిపై స్థల లభ్యతను బట్టి సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునేందుకు తమ బ్యాంకు సులువుగా రుణం అందిస్తోందన్నారు. ఆర్‌బీవో కంచి పురుషోత్తం, చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్, సుభాష్‌బాబు, రిలేషన్‌షిప్ మేనేజర్ సంతోష్, ప్రణయ పాల్గొన్నారు.

గుంపులలో వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని గుంపుల మానేరు వంతెనపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు యూరియా అక్రమ తరలింపు దృష్ట్యా బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. మండలం నుంచి యూరియాను వాహనాల్లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రభావిత గ్రామాలపై పట్టింపు కరువు

- ప్రధాన రోడ్లు గుంతలమయం
- అభివృద్ధికి నిధుల కేటాయించని వైనం


ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల్లో అధ్వానంగా ప్రధాన రహదారి

ఫెర్టిలైజర్‌సిటీ: 'పరిశ్రమలు వస్తే ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పంట పొలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చాం. పరిశ్రమలు వచ్చినా ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందడం లేదు' అని ప్రభావిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధి లక్ష్మీపురం, వీర్లపల్లి, విఠల్‌నగర్, ఎల్కలపల్లిగేట్ ప్రభావిత గ్రామాలు. గ్రామాల్లో మౌలిక వసతులు తాగునీరు, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కల్పించాలి. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రారంభ సమయంలో 2015 మార్చి 11న ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు వీర్లపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో కర్మాగారంలో ఉత్పత్తి మొదలుకాగానే ప్రభావిత గ్రామాల్లో అభివద్ధి పనులు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఉత్పత్తి ప్రారంభించి మూడేళ్లయినా ప్రభావిత గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆయ గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో 2024–25లో రూ.5291.19కోట్ల వ్యాపారం నిర్వహించగా రూ.414.3 కోట్ల ఆదాయం సాధించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్) నిధులు కేటాయించి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజల ఎదురుచూపులు..

రామగుండం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం ప్రభావిత గ్రామాలైన వీర్లపల్లి, లక్ష్మీపురం ఎల్కలపల్లిగేట్ గ్రామాల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఎస్‌ఆర్ నిధులు కేటాయిస్తేనే ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఎల్కలపల్లి గేట్ నుంచి యైటింక్లయిన్‌కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నిర్మాణ క్రమంలో భారీ వాహనాలు నడవడంతో పూర్తిగా ధ్వంసమైంది. సీఎస్‌ఆర్ నిధులతో రోడ్డు అభివృద్ధి చేయాలని 10 గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే ప్రభావిత గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు నిర్మించాలి



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం నిర్మాణ క్రమంలో లక్ష్మీపురం కొత్తగేట్ నుంచి వీర్లపల్లి గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ప్లాంట్ నిర్మాణ క్రమంలో భారీ యంత్రాలు, కర్మాగార సామగ్రి ప్లాంటుకు చేర్చే క్రమంలో భారీ వాహనాలు నడిపారు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. – **బాడె శ్రీనివాస్, వీర్లపల్లి**

ఇబ్బంది పడుతున్నాం



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామం లక్ష్మీపురం, లక్ష్మీపురంకొత్తగేట్ ఎల్కలపల్లిగేట్ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు కేటాయించాలి. – **బల్ల నాగరాజు, లక్ష్మీపురం కొత్తగేట్**

నిధులు కేటాయిస్తాం

రామగుండం ఎరువుల కర్మాగారం ఉత్పత్తి ప్రారంభించి మూడేళ్లయింది. 2023–24లో నగరపాలక సంస్థకు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి రూ.25లక్షల నిధులు నగరపాలక సంస్థకు చెల్లించాం. 2024–25లో సుమారు రూ.550కోట్ల వరకు సాధించే అవకాశం ఉంది. యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్‌ఆర్)లో భాగంగా ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే ప్రభావిత గ్రామాల అభివృద్ధికి (సీఎస్‌ఆర్) నిధులు కేటాయించేలా కృషి చేస్తాం. – **రమేశ్‌ఠాకూర్, ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం, ఆర్‌ఎఫ్‌సీఎల్ సైట్ ఇన్‌చార్జి**



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ నూతన 46వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో నాలాను కబ్జా చేసి కాలువలో మట్టి పోశారు. దీంతో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో కాలువ దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. రామగుండం కార్పొరేషన్ అధికారులు స్పందించి నాలా కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఐటీఐ చదువు.. కంపెనీల్లో కొలువు


హైదరాబాద్‌కు తరలుతున్న యువకులు

పెద్దపల్లిరూరల్: ఐటీఐలో వృత్తి శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్ బేస్డ్ ట్రైనింగ్ (సీబీటీ) శిక్షణ పొందిన విద్యార్థుల కోసం ఇటీవల మైక్రోసాఫ్ట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 15మంది విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. 15రోజుల శిక్షణ ఇచ్చిన అనంతరం బుధవారం వారంతా ఉద్యోగాల్లో చేరేందుకు సంతోషంగా బయల్దేరారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని సాయిరోహిత్, సుమిత్, ఆదిత్య, ముఖేశ్, సాయికిరణ్, ఫరాజ్, నితిన్, శివమణి, అఖి, యశ్వంత్ అఖిలాష్ తెలిపారు. ఐటీఐలో శిక్షణ పొందిన విద్యార్థులకు మంచి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు దక్కాయని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

అందుబాటులో యూరియా


సుందిళ్ల బ్యారేజ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు

మంథని: మంథని పీఏసీఎస్ సొసైటీ, ఎరువుల షాపుల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని మంథని ఏడీఏ అంజని మిశ్రా తెలిపారు. ప్రస్తుతం 90.31 టన్నుల యూరియా నిల్వ ఉందని, ఇతర ప్రాంతాలకు యూరియను తరలించకుండా సుందిళ్ల బ్యారేజీ, అడవిసోమన్‌పల్లి వద్ద రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

యూరియా కొరత లేదు

ఓదెల: మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయాధికారి భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని పొత్కపల్లిలోని ప్యాక్స్ కేంద్రంలో యూరియా బస్తాలను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలోని రైతులకు వానాకాలం సీజన్‌లో 1700 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ప్రతీరోజు ప్రభుత్వ, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా స్టాక్ ఉంటుందన్నారు. మండలంలోని పొత్కపల్లి ప్యాక్స్, ఓదెల, కొలనూర్, పిట్టలఎల్లయ్యపల్లె, గుంపుల, గూడెం గ్రామాల్లోని ప్రైవేట్ దుకాణాల్లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

వైకుంఠ రథం, ఫ్రీజర్ కొనుగోలుకు దాతల విరాళం


విరాళాలు అందిస్తున్న దాతలు

కాల్వశ్రీరాంపూర్: అంతిమయాత్ర కోసం వైకుంఠ రథం, ఫ్రీజర్ కొనుగోలు కోసం పలువురు దాతలు విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చారు. రిటైర్డ్ హెచ్‌ఎం మూల రమణారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి కిషన్‌రెడ్డి, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ఈ విషయమై చర్చించి విరాళాలు సేకరించి వైకుంఠ రథం, ఫ్రీజర్ కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఓ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం మూల రమణారెడ్డిని తాత్కాలిక కన్వీనర్‌గా నియమించారు. ముందుగా మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తనవంతుగా రూ.10వేలు, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి రూ.15వేలు, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు రూ.10వేలు, మాజీ ఎంపీటీసీలు మొండయ్యగౌడ్ రూ.2వేలు, బంగారి రమేశ్ ముదిరాజ్ రూ.5వేలు విరాళం అందించారు. విరాళం అందించే దాతలు మూల రమణారెడ్డి 99496 33181 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

25 నుంచి ఎస్జీఎఫ్ పోటీలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో 25 నుంచి 28 వరకు మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆరెపల్లి రాజయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పీఈటీలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. 25న 14, 17ఏళ్ల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు, 26న 14, 17ఏళ్ల బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 28న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి పీడీ టి.ప్రణయ్ 96183 36976 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నందిమేడారం బాలుర గురుకుల విద్యాలయంలో..

ధర్మారం: మండలంలోని నందిమేడారం బాలుర గురుకులం విద్యాలయంలో 25, 26 తేదీల్లో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో పోతు ప్రభాకర్ తెలిపారు. పోటీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు.

బసంత్‌నగర్‌లో 22 నుంచి..

పాలకుర్తి: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న బాలికలకు, 23న బాలురకు 14, 17 ఏళ్ల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రామగుండం పశ్చిమ మండల స్థాయి..

జ్యోతినగర్: రామగుండం పశ్చిమ మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు 22, 23వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈవో జింక మల్లేశం తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ క్రీడా మైదానంలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 22న బాలికల అండర్–14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు, 23న బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాల కోసం జెడ్పీహెచ్‌ఎస్ రామగుండం ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్ నంబర్ 98492 18365, ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎండీ జావిద్, 91778 85183 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


ధర్మారం: పూలమాల వేస్తున్న నాయకులు


యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ జయంతి


రామగిరి: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/ధర్మారం/ముత్తారం/జూలపల్లి/ఎలిగేడు/రామగిరి: జిల్లావ్యాప్తంగా మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి బుధవారం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారతదేశాన్ని సన్మార్గంలో నడిపించిన మహానుభావుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్ నిర్మించిన బ్యారేజీలతో చుక్కనీరు అందలేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గోదావరి నదిపై నిర్మించిన బ్యారేజీలతో రాష్ట్ర ప్రజలకు నష్టం తప్ప రైతాంగానికి చుక్కనీరు అందలేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంథనిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్యారేజీల నిర్మాణంతో బ్యాక్ వాటర్‌తో పంటపొలాల్లో వరదనీరు చేరి రైతులు నష్టపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సుందిళ్ల బ్యారేజీ వద్ద చేసిన ఆరోపణలను వారు ఖండించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గంలో అనేక చీకటి దందాలు సాగించిన ఘనత పుట్ట మధుదే అని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, తెలంగాణ విద్యుత్ బోర్డు నియంత్రణ కమిటీ సభ్యులు శశిభూషణ్ కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ఎరుకల ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 46వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి మేకల పోశం బుధవారం పనులు ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు ఓర్సు అనిల్, కొమురయ్య, తిరుపతి, కనకయ్య, కిరణ్‌కుమార్, చంద్రమౌళి, కొమ్మురాజు, సంపత్ పాల్గొన్నారు.

• పెరికసంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కానిగంటి శంకరయ్య పెరికసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చింతం స్వామి, సభ్యులుగా మాజీ ఉపసర్పంచు అప్పని కుమారస్వామి, డీలర్ రామస్వామి, బుద్దె మహేందర్, ఎర్ర మల్లయ్య, ఎంబాడి తిరుపతి, దొమ్మటి సదానందం ఎన్నికయ్యారు.

• అనారోగ్యంతో ఉద్యమకారుడు మృతి

ఓదెల: రాష్ట్రసాధన కోసం కృషిచేసిన ఉద్యమకారుడు మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన తోట లింగయ్య(85) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఆయా పార్టీల నాయకులు, ఉద్యమకారులు లింగయ్య కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

• ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మంథని: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఉద్యమకారుల రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బుధవారం రాహుల్‌గాంధీకి పోస్టుకార్డులు పంపించారు.

• మెగా మార్ట్‌లో చీటింగ్?

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మెగా మార్ట్ ఆడిట్‌లో చీటింగ్ జరిగినట్లు సమాచారం. రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఓ మెగా మార్ట్‌లో సుమారు రూ.72లక్షలు ఆడిట్‌లో తక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మార్ట్‌లో లావాదేవీలకు సంబంధించి విధులు నిర్వహించిన వ్యక్తితోపాటు మరికొందరిపై ఫిర్యాదు ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

• విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

రామగుండం: స్థానిక నవోదయ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థినులకు షీటీం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య, సభ్యురాలు స్నేహలత, షీటీం సభ్యులు మౌనిక, స్నేహలత, సురేశ్, పాఠశాల హెచ్‌ఎం బందారపు తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

• డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి మూడురోజుల జైలు

గోదావరిఖని: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన నలుగురిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ముగ్గురికి రూ.3వేల చొప్పున రూ.9వేలు జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ రెండోసారి పట్టుబడిన కొల్లూరు ప్రసాద్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ తీర్పునిచ్చారు. కాగా అతగిని కరీంనగర్ జైలుకు పంపినట్లు సీఐ చెప్పారు.

• ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

ఓదెల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపరపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు.

• పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

ఎలిగేడు: వర్షాకాలంలో దోమలు విజృంభించకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో భాస్కర్‌రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు, గ్రామసమాఖ్య అధ్యక్షులు, ఈజీఎస్ సిబ్బందితో 22 నుంచి జరిగే పనుల జాతరపై సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి, సలహాలు, సూచనలు చేశారు. ఎంపీవో కిరణ్, ఏపీఎం గీత, టీఏ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్‌లు, మేట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సత్కారం


మల్లన్నకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల వద్ద బుధవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు స్వాగతం పలికారు. మంచిర్యాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ కోఆర్డినేటర్ హరిశంకర్, జానయ్యతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యంలో పెద్దకల్వల వద్ద తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు గుండవేణ స్వామి, గంగారాం, రాజయ్య, రాజేందర్, జాషువా, ప్రసాద్, రాజశేఖర్ సత్కరించారు.

సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలి

గోదావరిఖనిటౌన్: బీసీ సమస్యల సాధనకై 25న హైదరాబాద్ ఇందిపార్క్ వద్ద చేపట్టే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ ప్రజా సంఘం రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు పోలవేణి నరేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టే సత్యాగ్రహ దీక్షలో బీసీ సంఘాలు పాల్గొనాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం ఛలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు గర్వందుల శ్రీకాంత్, అన్వేష్, కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఉన్నత విద్య చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. అడిషనల్ కలెక్టర్ వేణును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రైవేట్ కాలేజీలో చదివిన విద్యార్థులకు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు పేర్కొంటున్నాయని ఇది సరికాదన్నారు. విద్యార్థులను మానసిక వేదనకు గురిచేస్తున్న యజమాన్యాలపై చర్యలు తీసుకుంటారా, లేదా వారి బకాయిలను చెల్లిస్తారో ప్రభుత్వం నిర్ణయించుకోవాలన్నారు. లేదంటే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు. నాయకులు రాజం మహంత తదితరులు ఉన్నారు.

నీట మునిగిన పంటపొలాలు


మల్యాపూర్ శివారులో నీట మునిగిన పంట పొలాలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్యాపూర్ శివారులోని పంటపొలాలు వరద నీటికి నీట మునిగాయి. బుధవారం ఉదయం మల్యాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. సుమారు 20ఎకరాల వరకు వరి పంట నీటి మునిగినట్లు రైతులు వాపోయారు.